క్లుప్తంగా

దేవతామూర్తులకు వెండి కిరీటాల అలంకరణ



సంపత్ వేంకటేశ్వరుడికి అలంకరించిన కిరీటం

కంచరపాలెం: గొల్లకంచరపాలెంలో కొలువైన సంపత్ వేంకటేశ్వర స్వామి, కోదండ సీతా రామ స్వామి, ధనలక్ష్మిదేవి మూల విరాట్ దేవతామూర్తులకు గురువారం ప్రబోధిని ఏకాదశి సందర్భంగా వెండి కిరీటాలు అలంకరించారు. శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ, దాతల నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వేద పండితులు శాస్త్రోక్తంగా సంప్రోక్షణ పూజలు జరిపించారు. దాతలు నమ్మి రాజా రమేష్ రేవతి, నమ్మి చంద్రమోహన్, దాడి వెంకటరత్నం కిరీటాలు బహూకరించారు. మధ్యాహ్నం కమిటీ సభ్యులు భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేశారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



బాబాకు పూజలు చేస్తున్న భక్తులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్ఈబీ కాలనీలోని సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబాకు పంచామృతాలతో అభిషేకం చేశారు. కార్తీక మాసం, ఏకాదశి కావడంతో భక్తులు అధిక సంఖ్యలో బాబాను దర్శించుకున్నారు. అర్చకులు భక్తుల పేరుతో గోత్రనామ పూజలు చేశారు.

నటుడు చంద్రమోహన్‌కు నివాళులు



చంద్రమోహన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాసేవాపీఠం సభ్యులు

గోపాలపట్నం: సినీ నటుడు చంద్రమోహన్‌కు గోపాలపట్నం కళాసేవా పీఠం సభ్యులు నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, అంజలి ఘటించారు. ఈ సందర్భంగా కళాసేవా పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు నంవరపు సోములు మాట్లాడుతూ చంద్ర మోహన్ విలక్షణ నటుడని అన్నారు. హాస్య నటుడిగా, హీరోగా, విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా అన్ని పాత్రల్లోనూ ఆయన ఒదిగిపోయారని కొనియాడారు. పీఠం అధ్యక్షుడు గొరకల రామదాసు మాట్లాడుతూ 1966 నుంచి 2017 వరకు 50 ఏళ్లుగా ఆయన నటిస్తూనే ఉన్నారన్నారు. సేవాపీఠం మాజీ అధ్యక్షుడు చందు సుబ్బారావు, మిద్దె అప్పారావు, రంగస్థల నటుడు గులిమి అప్పారావు, కోశాధికారి భాస్కర్ పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

రాధాకృష్ణ మహోత్సవాలు జయప్రదం చేయాలి



ఉత్సవాల కరపత్రం విడుదల చేస్తున్న మల్కాపురం యాదవ సంఘం సభ్యులు

మల్కాపురం : ఆర్కే బీచ్ గోకుల్ పార్కు సమీప రాధాకృష్ణ ఆలయంలో ఈ నెల 26న జరగనున్న రాధాకృష్ణ మహోత్సవాలను పారిశ్రామిక ప్రాంత యాదవ సామాజిక ప్రజలు జయప్రదం చేయాలని జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు పిలుపునిచ్చారు. 61వ వార్డు మల్కాపురం, శ్రీవిజ్ఞాన మండలి యాదవ సంఘం వద్ద గురువారం సాయంత్రం ఉత్సవాలకు సంబంధించిన కరపత్రం విడుదల చేశారు. ఈ ఉత్సవాలకు భారీ ఎత్తున ప్రజలు తరలివచ్చి, రాధాకృష్ణులకు పాలు, పెరుగుతో అభిషేకాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్కాపురం, వెంకన్నపాలెం, వాయుపుత్ర కాలనీ, ప్రకాష్‌నగర్, త్రినాథ్‌పురం, నక్కవానిపాలెం ప్రాంత యాదవ సంఘాల ప్రతినిధులు సభ్యులు పాల్గొన్నారు. వెంకన్నపాలెం వద్ద వేణుగోపాల స్వామి ఆలయంలో స్థానిక యాదవ సంఘం ప్రతినిధి నీలాతి గుణవతి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాధాకృష్ణ మహోత్సవాల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు.

ఆహ్లాదం .. ఆరోగ్యం

సిటీ లైఫ్ అంటేనే బిజీ బిజీ.. ఆ గజిబిజి గందరగోళం నుంచి బయటపడి, సాయంత్రం వేళ ప్రకృతి ఒడిలో, ప్రశాంత వాతావరణంలో సేద తీరాలనుకునే వారిని నందనవనాన్ని తలపిస్తున్న పార్కులు స్వాగతిస్తున్నాయి. పాఠశాలల్లో పుస్తకాలతో కుస్తీ పట్టి వచ్చిన చిన్నారులను ఆహ్వానిస్తూ ఎన్నో ఆటపరికరాలు ఏర్పాటయ్యాయి. ఆహ్లాదకర వాతావరణంలో నడిచివద్దాం అనుకునే వారి కోసం వాకింగ్ ట్రాక్‌లు సిద్ధమయ్యాయి. యువతకు ఆరోగ్యాన్ని పెంపొందించే ఓపెన్ జిమ్‌లు కూడా పార్కులోనే నెలకొల్పారు. ఇలా.. అందం.. ఆహ్లాదం.. ఆరోగ్యం ఒకేచోట, అదీ ఇంటికి సమీపంలోనే సిద్ధమై, ఆహ్వానం పలుకుతున్నాయి.



90వ వార్డులోని సీతారామరాజు పార్కు



వుడా లే అవుట్ పార్కులో ఊయల ఊగుతున్న చిన్నారులు

విశాఖ విద్య: నగరంలోని ఎన్ఏడీ కూడలిలో పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, ఉన్నత విద్యాలయాలు అందుబాటులో ఉండటంతో ఇక్కడ స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకునే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వ్యాపార కార్యకలాపాలకు సైతం అనువైన ప్రాంతం కావడంతో రద్దీ పెరిగింది. ఈ నేపథ్యంలో భారీ అపార్ట్‌మెంట్లు సైతం వెలుస్తున్నాయి. రోజువారీ దినచర్యతో బిజీబిజీగా గడిపే ఎన్ఏడీ ప్రాంతవాసులు ఉదయం, సాయంత్రం వేళల్లో కాసేపు ఉపశమనం పొందేందుకు వీలుగా వార్డుల్లో పార్కులు నిర్మించారు.

వార్డు : 52	వార్డు : 90
అభివృద్ధి చేసిన పార్కులు: 8	అభివృద్ధి చేసిన పార్కులు: 2
వెచ్చించిన నిధులు : రూ.1.80 కోట్లు	నిధులు : రూ. 80 లక్షలు



- చూడముచ్చటగా పార్కులు
- పిల్లలు ఆడుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు
- ఓపెన్ జిమ్‌లతో పార్కులకు క్యూ
- వాకింగ్ ట్రాక్‌లతో అందరికీ ఉపయోగం

● అభివృద్ధి చేసిన పార్కులు ఇవే..

శాంతినగర్ పార్కు, గౌరీ నగర్ పార్కు, వాసవి టవర్స్ పార్కు, మెరీడియన్ టవర్స్ పార్కు, తారకరామ అపార్ట్‌మెంట్ పార్కు, ఓల్ట్ కరాస పార్కు, వుడా లే అవుట్ పార్కు(పాతది, కొత్తది), శాంతినగర్ ట్రయంగిల్ పార్కు, శివశివానీ స్కూల్ పార్కు, సీతారామరాజు పార్కు

● పరచుకున్న పచ్చదనం

పార్కుల అభివృద్ధిలో భాగంగా గ్రీనరీకి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఉద్యానవన శాఖ ద్వారా వివిధ రకాల మొక్కలు పెంచుతున్నారు. సాయంత్రం వేళ చీకటి పడినా ఇబ్బంది లేకుండా, లైట్లు అమర్చారు. పిల్లలకు ప్రత్యేకంగా ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. అన్ని వర్గాల వారికి ఉపయోగకరంగా ఉండేలా వ్యాయామ పరికరాలు అందుబాటులో ఉంచారు. వాకింగ్ ట్రాక్‌లు అనువుగా ఉండటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ ట్రాక్‌లకు జనం క్యూ కడుతున్నారు.

నాడు అలా.. నేడు ఇలా..

గత పాలకులు పార్కులను అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యం వహించడంతో ఎన్ఏడీ నుంచి బీచ్ రోడ్ లేదా వుడా పార్కు, తెన్నేటి పార్కు వరకు వెళ్లాల్సి వచ్చేది. నేడు పరిస్థితి మారింది. విశాఖ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా ఎన్ఏడీ కూడలికి ఇరువైపులా ఉన్న వార్డుల్లో పార్కుల అభివృద్ధికి జీవీఎంసీ అధికారులు ప్రాధాన్యం ఇచ్చారు. వార్డుల్లో సౌకర్యాల కల్పనతో పాటు ఆహ్లాదకర వాతావరణం ఉండేలా పార్కులు, ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటయ్యాయి.



సీతారామరాజు పార్కులో పచ్చదనం



శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలు



కాలనీ పార్కులో ఆడుకుంటున్న చిన్నారులు

ఇన్నాళ్లకు నెరవేరింది



పార్కులు అభివృద్ధి చేయాలని ఎప్పటి నుంచో కోరుతున్నాం. కానీ గతంలో ఎవ్వరూ పట్టించుకోలేదు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రత్యేక చొరవ తీసుకుని, పార్కులను అభివృద్ధి చేయటం వల్ల అందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంది. మా వాకర్స్ క్లబ్ సభ్యులందరం ప్రతీ రోజు పార్కులో వాకింగ్ కోసం వెళ్తుంటాం.

– డి.లక్ష్మణరావు, వుడా లే అవుట్ కాలనీ

అందరికీ ఉపయోగపడేలా..



వార్డు పరిధిలో అందరికీ ఉపయోగపడేలా పార్కులను అభివృద్ధి చేశాం. పిల్లలు, మహిళల కోసం ప్రత్యేకంగా పార్కులను తీర్చిదిద్దుతున్నాం. వ్యాయామానికి అనువుగా పరికరాలు ఏర్పాటు చేయటం వల్ల యువత ఉత్సాహం కనబరుస్తున్నారు. పార్కుల్లో పచ్చదనం పెంచేలా శ్రద్ధ తీసుకుంటున్నాం.

– జియ్యాని శ్రీధర్, డిప్యూటీ మేయర్

ప్రకృతికి దగ్గరగా ఉన్న అనుభూతి



పిల్లలను పార్కుకు తీసుకువెళ్లాలంటే గతంలో సిటీ వరకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు దగ్గర్లోనే పార్కు ఉండటంతో సాయంత్రం వేళల్లో ఆహ్లాదకరం వాతావరణంలో గడుపుతున్నాం. పిల్లల ఆటపాటలతో పాటు మా ఈవెనింగ్ వాక్ కూడా అయిపోతుంది. సిటీలో ఉన్నా ప్రకృతికి దగ్గరగా ఉన్నామన్న అనుభూతి కలుగుతోంది.

– ఎం. సత్య, లక్ష్మీనగర్

ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దుతున్నాం



పార్కుల అభివృద్ధిలో భాగంగా చేపట్టే పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా పార్కుల్లో తగిన మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నాం. అందరికీ ఉపయోగకరంగా ఉండేలా పనులు చేస్తున్నాం. చేపట్టే పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తున్నాం.

– ఏడుకొండలు, డిప్యూటీ ఇంజినీర్, జీవీఎంసీ 5వ జోన్

డ్రైవర్ నాగేశ్వరరావు కేసులో న్యాయం కావాలి

5వ వర్ధంతిలో ఆర్‌టీసీ ఉద్యోగుల డిమాండ్



సింహాచలం డిపో వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్‌టీసీ కార్మికులు, పలు సంఘాల నాయకులు

గోపాలపట్నం: ఆర్‌టీసీ డ్రైవర్ చింతా నాగేశ్వరరావు మృతి కేసులో న్యాయం కావాలని ఆర్‌టీసీ ఉద్యోగులు దళిత, ప్రజా, కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సింహాచలం డిపో సమీపంలో ఏపీఎస్ ఆర్‌టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం 5వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ చింతా నాగేశ్వరరావు బలవన్మరణానికి కారణమైన అప్పటి డిపో మేనేజర్ దివ్యపై ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఘటన జరిగి 5 ఏళ్లు అయినా ఈ కేసులో ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. అనంతరం డిపో వద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల సమాఖ్య అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటరమణ, దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, విశాఖ జిల్లా దళిత సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు, పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, గుడివాడ అప్పారావు, ఏపీఎస్ ఆర్‌టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్.ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

మానవ సేవే మాధవ సేవ




పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

విశాఖ విద్య: మానవ సేవే మాధవ సేవ అని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ ఆడారి ఆనంద్‌కుమార్ సోదరి, యలమంచిలి మున్సిపల్ చైర్ పర్సన్ పల్లా రమాకుమారి అన్నారు. 90వ వార్డు ఏపీఎస్ఈబీ కాలనీలో గోపాలపట్నం భజన మండలి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సత్యసాయిబాబా జయంతి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. సత్యసాయిబాబా చిత్ర పటం వద్ద పూలమాలలు వేసి, పూజలు నిర్వహించారు. భజన మండలి సమకూర్చిన వస్త్రాలను పేదలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తండ్రి చూపిన బాటలో ప్రజా సేవలో సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో 90వ వార్డు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు నమ్మి శ్రీను, చుక్క ప్రసాదరెడ్డి, వెంకటేశ్వరావు, సత్య, సూరిబాబు, చంద్రమౌళీశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరాజు, భజన మండలి నిర్వాహకులు పాల్గొన్నారు.

61వ వార్డులో..

మల్కాపురం: భగవాన్ సత్యసాయి బాబా 98వ జయంతిని గురువారం పారిశ్రామిక ప్రాంతంలో సత్యసాయి భక్తులు కనువలపండువగా నిర్వహించారు. దీనిలో భాగంగా 61వ వార్డు ఇండస్ట్రియల్ కాలనీ వద్ద గల రామాలయంలో నెలకొల్పిన సత్యసాయి పీఠం వద్ద నిర్వహించిన కార్యక్రమానికి అతిథిగా యలమంచిలి మున్సిపల్ చైర్మన్ పీలా రమాకుమారి హాజరయ్యారు. ఆమె బాబాకు తొలుత పూజలు చేసిన అనంతరం, భక్తులతో కలిసి బాబా కీర్తనలు ఆలపించారు. అనంతరం అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొణతాల సుధ, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు జి.వి.ఎస్.ఎన్.రాజు (కేబుల్ వాసు), 63వ వార్డు పార్టీ ఇన్‌చార్జి పిలక రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీఎఫ్ గౌరవ సలహాదారుడిగా త్రినాథరావు



కల్పలతా రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

విశాఖ విద్య: వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ సలహాదారుడిగా అల్లూరి జిల్లా అరుకు ఎంఈవో–1 వంతల త్రినాథరావు నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్ రెడ్డి, కార్యదర్శి సుధీర్ నియామకాన్ని ప్రకటించారు. గెజిటెడ్ అధికారి హోదా గల వంతల త్రినాథరావు సేవలను సంఘం అభివృద్ధికి ఉపయోగించుకుంటామని వైఎస్సార్ టీఎఫ్ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు చొక్కాకుల సూర్యనారాయణ తెలిపారు. గురువారం ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డిని కలసి సంఘం బలోపేతంపై తీసుకుంటున్న చర్యలపై వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీని సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



క్షతగాత్రుల వివరాలు తెలుసుకుంటున్న ఏఎస్ఐ రామారావు

విశాఖ విద్య: ఎన్ఏడీ సమీపంలోని హైవేపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. ప్రాంతీయ రవాణ శాఖ కార్యాలయం వైపు నుంచి మర్రిపాలెం కాలనీ వైపు వచ్చే క్రమంలో రోడ్డు దాటుతున్న ఇద్దరిని ఓ ద్విచక్ర వాహనదారుడు వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ద్విచక్ర వాహనదారుడు అగకుండా వెళ్లిపోవడంతో అటుగా వెళ్తున్న వారు క్షతగాత్రులకు సేవలు అందించారు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఏఎస్ఐ రామారావు తన సిబ్బందితో అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదంలో గాయపడిన వారి వివరాలు సేకరించారు. పరారైన ద్విచక్ర వాహనదారుడి గురించి పోలీసులు విచారణ చేస్తున్నారు. ఇదే సమయంలో అక్కడ మరో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో వైద్యం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

గణపతినగర్‌లో సీసీ రోడ్డుకు శంకుస్థాపన



భూమి పూజలో పాల్గొన్న రమాకుమారి, సురేష్‌యాదవ్

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ చొరవతో 20 ఏళ్ల నాటి సమస్యకు మోక్షం కలిగింది. 59వ వార్డు గణపతినగర్ కొండ ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎట్టకేలకు గురువారం శంకుస్థాపన చేశారు. గత నెల ఈ ప్రాంతంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ ద్వారా సమస్యను తీసుకెళ్లారు. ఆ సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు యలమంచిలి మున్సిపాల్ చైర్‌పర్సన్, విశాఖ డెయిరీ బోర్డు మెంబర్ పీలా రమాకుమారి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్, వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

మంచి చేస్తున్న సీఎం జగన్‌కే ప్రజల మద్దతు



సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న బెహరా భాస్కరరావు



వెంకటాపురం సభలో మాట్లాడుతున్న బెహరా భాస్కరరావు

- జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు
- ఇందిరానగర్‌లో 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే..'

గోపాలపట్నం: రాష్ట్ర ప్రజలకు మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా అందరూ నిలవాలని జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు కోరారు. ఈ మేరకు జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురం 460 సచివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఇక్కడ పార్టీ జెండాను, సచివాలయంలో ప్రభుత్వం మంజూరు చేసిన పథకాల బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సచివాలయం పరిధిలో లబ్ధిదారులకు రూ.2,05,43,213 నగదు అందించారన్నారు. ఎక్కడా అవినీతి లేకుండా ప్రభుత్వ పథకాల నిధులు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరుతున్నాయన్నారు. నియోజకవర్గంలో పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ తనకు అధికారం లేకపోయినా అభివృద్ధికి సహకరిస్తున్నారని చెప్పారు. చాలా చోట్ల సొంత నిధులతో కమ్యూనిటీ హాలు నిర్మాణాలు, పింఛన్ల అందజేత వంటి పనులు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామినాయుడు, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, నీలాపు లోకేష్‌రెడ్డి, అభిరామ్, కంపర రామకృష్ణ, మనోహర్, జగదీష్, సురేష్, కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేస్తున్న వార్డు కార్పొరేటర్ లక్ష్మణరావు

సింథియా: ప్రజల ఆరోగ్యంపై సిబ్బంది శ్రద్ధ వహించాలని 62వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు బల్ల లక్ష్మణరావు సూచించారు. వార్డులో ఇటీవల జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పాటు సీజనల్ వ్యాధుల నివారణపై వార్డు మలేరియా సిబ్బంది, హెల్త్ సెక్రటరీలు, ఆశ కార్యకర్తలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరాలలో నమోదైన ఆరోగ్యశ్రీ రిఫరల్ కేసులను సకాలంలో ఆయా ఆసుపత్రులకు తీసుకు వెళ్లాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పని చేసేటప్పుడు ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని.. వారి ఆరోగ్యంపై ఆరా తీసి నిత్య పర్యవేక్షించాలని సూచించారు. సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యాలను కట్టడి చేసేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వార్డు మలేరియా సూపర్‌వైజర్ డి.శ్రీనివాసరావు, హెల్త్ సెక్రటరీలు రమ్య, భారతి, రాము, ఆశ కార్యకర్తలు కనకరత్నం, సుజాత, రాణి తదితరులు పాల్గొన్నారు.

'విభజన హామీలపై మాట్లాడండి'

డాబాగార్డెన్స్: రాజకీయ పార్టీలు విభజన హామీలపై మాట్లాడాలని ఏపీ ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి ప్రతినిధులు ప్రొఫెసర్ అప్పలనాయుడు, చలసాని శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఏ ఒక్క రాజకీయ పార్టీ నాయకుడు కూడా ప్రత్యేక హోదా, విభజన హామీలపై మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా విమర్శలే తప్పా..విభజన హామీలపై మాట్లాడడం లేదన్నారు. ఈ సమయంలో కూడా రాష్ట్రం కోసం పట్టించుకోకపోతే ఎలా? అని ప్రశ్నించారు. సమావేశంలో ఎం.జగ్గు నాయుడు తదితరులు పాల్గొన్నారు.